RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక





సంపుటి : 13 సంచిక : 11 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 18 జూలై 2024 పేజీలు : 4 వెల : 2/-

# రైతు వేదికల వద్ద సంబురాలు

## నేడు రాష్ట్ర బ్యాంకర్లతో సీఎం సమావేశం


## వెను వెంటనే రైతులను ఉద్దేశించి సందేశం




హైదరాబాద్: ప్రజాభవన్ లో రేపు ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్లతో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, తదితరులు పాల్గొననున్నారు.

లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ అమలులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేయనున్నారు. రూ. లక్ష రూపాయల లోపు రైతు రుణమాఫీ చేయనున్న నేపథ్యంలో అన్ని మండల కేంద్రాలలో ఉన్న రైతు వేదికల్లో రైతుల సమావేశాలు నిర్వహించనున్నారు.

దీంతో హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సందేశం ఇవ్వనున్నారు. రైతు వేదికల దగ్గర సంబరాలకు పిలుపు నిచ్చారు. రేపు సాయంత్రానికి రైతుల ఖాతాలోకి లక్ష రుణమాఫీ చేయనున్నారు. ఒకటి, రెండు రైతులతో సీఎం స్వయంగా మాట్లాడనున్నారు. ఇక రాష్ట్రంలో రుణమాఫీ అమలులో భాగంగా తొలి విడతగా రూ.లక్ష మేర రుణాలున్న రైతుల ఖాతాల్లో రేపు (గురువారం) నగదు జమ జరగనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.



## పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడండి...

సిద్దిపేట జిల్లా, జూలై 17: నాలుగు రోజుల క్రితం కొండపాక మండలం దమ్మక్కపల్లి గ్రామంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు బండి కిష్టయ్యను.. మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. భూ తగాదాల విషయంలో గడ్డి మందు సేవించి బలవన్మరణానికి యత్నించడంతో బండి కిష్టయ్యను వెంటనే ములుగు మండలంలోని ఆర్వీఎం ఆసుపత్రి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని హరీష్ రావు పరామర్శించి.. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా పేద రైతుల భూముల మీద దాడులు చేసి భూములను లాక్కుంటున్న ఘటనలకు రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిపోయాయన్నారు.

న్యాయం చేయండని అడిగిన కొండపాక మండలం దమ్మక్క పల్లి గ్రామానికి చెందిన బండి కిష్టయ్య అనే రైతుపై కేసు పెట్టి భయ బ్రాంతులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యం వల్ల, విపరీత చర్యలతో అధికారుల మీద ఒత్తిడి చేయడం వల్ల ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారితో విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ సమగ్ర విచారణ జరిపి రైతు ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి దౌర్జన్యాలు ఆపాలన్నారు. పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి రైతు భూమి రైతుకు దక్కేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ,రెవెన్యూ మంత్రికి హరీష్ రావు డిమాండ్ చేశారు. హరీష్‌రావుతో పాటు మాజీ ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి బాధిత రైతును పరామర్శించారు.

## అప్పుల్లో ఉన్నా.. నెలల వ్యవధిలోనే రుణమాఫీ అమలు చేస్తున్నాం: భట్టి

హైదరాబాద్: ఆగస్టు నెల దాటకుండానే రూ. 2లక్షల రైతు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ హామీ అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి.. రూపాయి పొగుచేసి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని తెలిపారు. రుణమాఫీ కార్యక్రమాన్ని పోలింగ్ బూత్ స్థాయిలో ప్రతి ఓటరు దగ్గరకు తీసుకెళ్లాలని, తల ఎత్తుకొని.. ఎక్కడా తగ్గకుండా ప్రచారం చేయాలని కాంగ్రెస్ నాయకులకు భట్టి



సూచించారు. "రూ. 7లక్షల కోట్ల అప్పుతో అధికార బాధ్యతలు తీసుకున్న కాంగ్రెస్ రూ. 2లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే అమలు చేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే హామీలు అమలు చేస్తున్నాం. కానీ, అనుకున్నంత ప్రచారం క్షేత్రస్థాయిలో జరగట్లేదు. పార్లమెంట్ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారు. సీఎం సవాల్ ఓట్ల కోసమే అనుకున్నారు. కానీ, అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రుణమాఫీ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని వివరిస్తూ రైతులు, ప్రజల హృదయాలు గెలవాలి" అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.




## ఈనెల 20న ఢిల్లీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఎందుకంటే..?

హైదరాబాద్: ఢిల్లీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈనెల 20 వ తేదీన వెళ్లనున్నారు. అక్కడ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులతో భేటీ కానున్నారు. మేడిగడ్డ, అన్నారం , సుందిళ్ల బ్యారేజ్‌లపై ఎన్డీఎస్ఏతో ఉత్తమ్ చర్చించనున్నారు. ఎన్డీఎస్ఏ అధికారులతో పలు ప్రాజెక్ట్‌లకు సంబంధించిన విషయాలపై ఆరా తీయనున్నారు. వర్షాల నేపథ్యంలో డ్యామ్‌ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అలాగే రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేయనున్నారు. ఢిల్లీ పర్యటనకు సంబంధించిన వివరాలను ఈరోజు( బుధవారం) మంత్రి ఉత్తమ్ మీడియాకు వెల్లడించారు. రూ. 28 వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు.

రూ.18 వేల కోట్లు గత ప్రభుత్వ అప్పుల ఇంట్రెస్ట్‌కి పోతున్నాయని తెలిపారు. ఈ వర్క్స్ ఎక్స్‌పెండిచర్ కోసం రూ.11 వేల కోట్ల బడ్జెట్‌లో పెట్టాలని ఆర్థిక శాఖని కోరుతున్నామని అన్నారు. 2025 డిసెంబర్ 25 వరకు పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. డిండి కూడా తమ ప్లాన్‌లో ఉందని వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బడ్జెట్ వేసి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కి పంపుతున్నామని అన్నారు. సమ్మక్క ప్రాజెక్ట్ కోసం ఛత్తీస్‌గఢ్‌తో ల్యాండ్ కోసం సంప్రదింపులు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పలు ప్రాజెక్టుల వద్ద ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. బ్యారేజీకి సంబంధించిన ఇరిగేషన్ అధికారులతో సమావేశమై పలు అంశాలపై ప్రత్యేకంగా సమీక్షిస్తుంది. భారీవర్షాలు పడితే ప్రాజెక్ట్‌లకు ఏమైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందా అనే కోణంలోనూ అధికారుల నుంచి మంత్రి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్ట్‌లపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్ట్‌లకు కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది.

# ఆగస్టులోపే 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ఆగస్టులోపే 3 విడతల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రుణమాఫీ నిధులు విడుదల చేస్తామని చెప్పారు. తొలి విడతగా రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలకు నిధుల విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోపు రూ. 1.5లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఆగస్టులో రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని సీఎం వివరించారు.

**గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం :** ప్రజాభవన్‌లో

## తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలి

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. " ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పాం. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్ రూ. 28వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారు. రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. ఆయన మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనం. పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియాగాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.

**రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ :** ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలి. వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలి. నా జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు. గురువారం సాయంత్రం 4గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తున్నాం. రూ. 7వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయి. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తాం. ఆగస్టులోగా రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేసి ఆ ప్రక్రియను పూర్తి చేస్తాం.

రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. అందుకే ఏక మొత్తంలో రూ. 2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నాం. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే రుణమాఫీ. మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించండి.

**హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి :** గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించండి. రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ. 31వేల కోట్లతో రుణమాఫీ చేయలేదు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్ లో ఎంపీలు ప్రస్తావించాలి. గురువారం గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలి.

ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలి. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబరాలు జరపాలి. ఏడు నెలల్లో మన ప్రభుత్వం సంక్షేమానికి రూ. 30వేల కోట్లు ఖర్చు చేసింది" అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## బీజేపీకి బాధ్యత లేదా? బడ్జెట్ వేళ ఏం చేస్తారో?

ఏపీలోని కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన.. బీజేపీ ఒకమంత్రి పదవిని కూడా తీసుకున్న విషయం తెలిసిందే. ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్‌కు చంద్రబాబు కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పదవిని కేటాయించారు. ఇక, టీడీపీ-జనసేనలతో జత కట్టిన నేపథ్యంలో బీజేపీ ఏకంగా 8 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుంది. ఈ నేపథ్యంలో త్వరలోనే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో ఏపీకి సంబంధించి నిధుల కేటాయింపుపై చర్చించేందుకు చంద్రబాబు ఇప్పటికే ఒకసారి ఢిల్లీ వెళ్లి ప్రతిపాదనలు ఇచ్చి వచ్చారు. ఇప్పుడు(మంగళవారం) మరోసారి ఆయన ఢిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో బీజేపీ తరఫున కూడా.. కేంద్రం పై ఒత్తిడి తీసుకు రావాలనే సూచనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రానికి ఏమేమేం అవసరమో.. ఎంతెంత నిధులు కావాలో.. బీజేపీ కి కూడా తెలుసు కాబట్టి ఆదిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఇప్పటి వరకు బీజేపీ నాయకులు ఎవరూ కూడా స్పందించలేదు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారు. వారు కూడా.. పార్లమెంటు సమావేశాల్లో ఏపీకి సంబంధించిన నిధుల వ్యవహారాన్ని లేవనెత్తడంతో పాటు.. బడ్జెట్ ప్రతిపాదనల్లోనూ వారు కొన్ని సూచనలు చేసి.. ఏపీకి వచ్చే నిధులపై కేంద్రాన్ని ప్రశ్నించడమో.. బ్రతిమాలడమో చేయాలన్న సూచనలు కూటమి పార్టీల నుంచే వినిపిస్తున్నాయి. వారు కూడా రాష్ట్రంలో ఎదగాలని భావిస్తున్న నేపథ్యంలో మౌనంగా ఉంటే సరికాదని.. అంతా చంద్రబాబుపై భారం వేసి చూస్తూ.. కూర్చుంటే ఎలా అనే ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. కానీ, ఇప్పటి వరకు బీజేపీ నాయకులు కానీ.. ఎంపీలు కానీ.. ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. మరి ఈ వారంలో అయినా.. కదలిక ఉంటుందేమో చూడాలి.

## సర్వమత సమ్మేళనంగా హస్సేన్ హుస్సేన్ రుయ్యాడి దైవ క్షేత్రం

### జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

### ప్రసిద్ధ రుయ్యాడి దైవ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ






**ఆదిలాబాద్ జులై 17(ప్రభాత సమాచారం)** రుయ్యాడి గ్రామం లోని సుప్రసిద్ధ దైవ క్షేత్రం హస్సేన్ హుస్సేన్ దైవాలను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం బుధవారం సందర్శించారు. హస్సేన్ హుస్సేన్ ఆలయంలో దర్శనం చేసుకొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామం సమావేశ మందిరం లో గ్రామ చరిత్ర,సంస్కృతి, ఆచారాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా కలిసికట్టుగా పండుగలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకావాలని కోరారు. గ్రామంలో పోలీసులకు సంబంధించి ఎటువంటి సమస్యలకైనా తనను సంప్రదించవచ్చని సూచించారు. ఈ దైవ క్షేత్రం సర్వమత సమేతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ విజయ డైరీ ఛైర్మెన్ లోక భూమా రెడ్డి, డి.ఎస్.పి.ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫనిధర్, సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మాఫీ పొందిన రైతులతో కలిసి రైతువేదికల్లో సంబరాలు జరుపుకోవాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



**ఆదిలాబాద్ జులై 17(ప్రభాత సమాచారం):**
జిల్లాలోని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు , బ్యాంక్ అధికారులు,సహకార శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా రైతు రుణమాఫీ 2024 అమలు పై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు జారి చేశారు. జిల్లాలో లక్షలోపు పంట రుణాలు పొందిన 18739 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమాన్ని రైతులతో కలసి పండగ వాతావరణం లో మాఫీ పొందిన రైతులతో రైతువేదికలలో సంబరాలు జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి మండలానికి మండల వ్యవసాయ అధికారిని నోడల్ అధికారి గా నియమించడం జరిగిందని, ప్రతి క్లస్టర్ లో రైతుల ర్యాలీలు, రైతువేదికలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి గారు రేపు అనగా 18-07-24 నాడు రైతులనుద్దేశించి సందేశాన్ని ఇస్తారన్నారు టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ,జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య,జిల్లా సహకార అధికారి గారు పాల్గొన్నారు

## సవరణ.. భారమే సేకరణ




హైదరాబాద్ : భూముల ధరలను సవరించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం పచ్చజెండా ఊపితే ఆగస్టు ఒకటి నుంచే పెరిగిన మార్కెట్ ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. వాస్తవిక ధరలకు, మార్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో భూముల ధరలను పెంచడం అవసరమే అయినా... ఇది సరైన సమయం కాదని రియల్ ఎస్టేట్ సంఘాలు అంటున్నాయి. పెరిగే ధరలు స్థిరాస్తి కొనుగోలు దారులకే కాదు సర్కారు మీద కూడా భారం పడనుంది. ధరలు పెరిగితే భూ సేకరణ వ్యయం పెరిగి మెట్రో రెండోదశ ప్రాజెక్ట్ అంచనాలు భారీగా మారనున్నాయి. సిటీలో చేపట్టే ఇతర మౌలిక వసతుల ప్రాజెక్ట్‌ల అంచనాలు పెరిగే అవకాశం ఉంది. ఈ దశలో సర్కారు ముందుకు వెళుతుందా? మరికొంత కాలం వేచిచూస్తుందా? అనేది పెద్ద ప్రశ్నగా ఉంది.

**చివరి దశలో డీపీఆర్‌లు**

మెట్రోరైలు ప్రస్తుతం మూడు కారిడార్లలో 69.2 కి.మీ. మార్గం అందుబాటులో ఉంది. పెరుగుతున్న ట్రాఫిక్, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండోదశలో మరో 70 కి.మీ. మార్గం నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి కారిడార్లను ఎంపిక చేసింది. వీటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్)ను రూపొందించాలని మెట్రోరైలు అధికారులను ఆదేశించింది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని తుది రూపు ఇచ్చే పనిలో డీపీఆర్ కన్సల్టెన్సీలు ఉన్నాయి. భూముల మార్కెట్ ధరలు పెంచితే ఆ మేరకు భూసేకరణ వ్యయ అంచనాలను పెంచాల్సి వస్తుంది.

**తొలుత పాతబస్తీ ప్రాజెక్ట్‌పై**

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ. మెట్రో నిర్మాణానికి కొద్దినెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మొదట ఇరుకుగా ఉన్న రహదారులను విస్తరించాల్సి ఉంది. ఇందుకోసం సుమారు 1100 వరకు ఆస్తులు ఉన్నట్లు మెట్రో అధికారులు గుర్తించారు. కచ్చితంగా ఎంత మేరకు సేకరణ అవసరమనే డ్రాయింగ్‌పనులు జరుతున్నాయి. భూముల మార్కెట్ ధరలు సవరిస్తే ఆ ప్రభావం మొదట పాతబస్తీ మెట్రోపైనే ఉంటుంది. ప్రాజెక్ట్ నిర్మాణం, భూసేకరణకు కలిపి రూ.2వేల కోట్లు అవుతుందని మార్చిలో అధికారులు తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉంటుంది. భూముల ధరల సవరణతో ఆస్తులు కోల్పోయేవారికి మెరుగైన పరిహారం అందుతుందనే వాదనలు ఉన్నాయి.

**మెట్రో కారిడార్లలో సేకరణ..**

రాయదుర్గం నుంచి బయోడైవర్సిటీ, నానక్‌రాంగూడ కూడలి, విప్రో కూడలి మీదుగా అమెరికన్ కాన్సులేట్ వరకు 8 కి.మీ. మార్గంలోనూ ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది.

మియాపూర్ - బీహెచ్‌ఈఎల్ - పటాన్‌చెరు మార్గంలో 14 కి.మీ. దూరం ఉంటుంది. పెద్దగా భూసేకరణ సమస్యలు లేవు.

ఎల్బీనగర్-హయత్‌నగర్ 7 కి.మీ. మార్గంలోనూ జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్లతో అలైన్‌మెంట్ సవాళ్లున్నాయి. ఇలాంటి చోట కొన్ని ఆస్తులను సేకరించాల్సి ఉంటుంది. మార్కెట్ ధరలను సవరిస్తే ఆ మేరకు అంచనాలు పెరిగే అవకాశం ఉంది. సర్కారు పెంచిన తర్వాతే అంచనా వ్యయాల్లో పెరుగుదల ఎంతనేది స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు. ఆలస్యం కారణంగా ఇప్పటికే పదేళ్లలో అంచనా వ్యయాలు ఎంతో పెరిగాయి. ధరల సవరణతో మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

**మిగతా 70 కి.మీ. మార్గంలోనూ...**

రెండో దశలో విమానాశ్రయ మార్గం ఒకటి. నాగోల్ - ఎల్బీనగర్ కలుపుతూ.. అక్కడి నుంచి చంద్రాయణగుట్ట - మైలార్‌దేవ్‌పల్లి - పీ7 రోడ్ - శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోని నిర్మించనున్నారు. 29 కి.మీ. మార్గమిది. ఈకారిడార్‌లో నాగోల్ నుంచి సాగర్ రింగ్‌రోడ్డు వరకు పలు ఫ్లైఓవర్లు ఉండటంతో కొన్నిచోట్ల ఆస్తుల సేకరణ అనివార్యం. ఆ తర్వాత ఓవైసీ కూడలిలో, చంద్రాయణగుట్ట ప్రాంతంలో మెట్రో నిర్మాణానికి, జంక్షన్ స్టేషన్‌కు ఆస్తులు సేకరించాలి. ఫలక్‌నుమా నుంచి చంద్రాయణగుట్ట మార్గాన్ని కలపాల్సి ఉంటుంది.

## రామగుండం ఓపెన్ కాస్ట్-2 గనిలో మట్టిపెళ్లలు కూలి ఇద్దరు కార్మికుల మృతి



**పెద్దపల్లి జులై 17(ప్రభాత సమాచారం)** పెద్దపల్లి జిల్లా రామగుండం ఓపెన్ కాస్ట్-2 గనిలో మట్టిపెళ్లలు కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పైప్‌లైన్ లీకేజీని ఆపేందుకు వెళ్లిన నలుగురిపై కూలిన మట్టి పెళ్లలు పడడంతో ఊపిరాడక చనిపోయారు. ప్రమాదంలో ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ ప్రాణాలు కోల్పోయారు

## విట్టల్ రుక్మాయి ఆలయం పూజలు చేసిన మాజీ జెడ్పీ చైర్మన్



**ఇంద్రవెల్లి జులై 17 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ధన్నోర(బి) గ్రామంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని విట్టల్ రుక్మాయి ఆలయంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ విట్టలేశ్వరుని దర్శించుకొని,ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారి,ఆలయ కమిటీ సభ్యులు జెడ్పీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, నారాయణ్, భక్తరాజ్, గజానంద్,భాస్కర్,తిరుపతి తదితరులు ఉన్నారు.

## తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



**ఇంద్రవెల్లి జులై 17 (ప్రభాత సమాచారం)**
మండలంలో తొలి ఏకాదశి పూజలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని ధనోరా(బీ), మండలకేంద్రంలోని భీంనగర్ విఠల్ రూక్మాయి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. విఠల్ రూక్మాయి ప్రతిమలతో కుడిన పల్లకితో గ్రామాల్లో భారీ శోభాయాత్ర నిర్వహించారు. భక్తి పాటలపై భక్తులు ఆడిపాడారు.కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఘనంగా మొహర్రం ఉత్సవాలు



**ఇంద్రవెల్లి జులై 17 (ప్రభాత సమాచారం)** మండలంలోని గోండ్ గూడ, ప్రధాన్ గూడా గ్రామాల్లో పీరీల ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని గోండుగూడ, ప్రధాన్ గూడా గ్రామానికి చెందిన భక్తులు పీరీలను ఎత్తుకొని ఆడిపాడారు. గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పీరీలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పీరీలను చూసేందుకు భారీగా తరలివచ్చి ప్రజలు దర్శించుకుంటున్నారు.పీరీల వద్ద భక్తులు రాత్రివేళల్లో డప్పుచప్పుళ్ల మధ్యలో భక్తులు మొహర్రం నృత్యాలు చేస్తున్నారు. ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో పీరీల ఉత్సవాలతో సంబురాలు మారుమోగిపోతున్నాయి. మొహర్రం ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మొహరం సందర్భంగాతెలంగాణ ఏక్తా సంఘం ఆధ్వర్యంలో రక్తదానం




**నిర్మల్ జులై 17(ప్రభాత సమాచారం)**
మొహరం సందర్భంగా తెలంగాణ ఏక్తా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్ పట్టణంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించా రు.పూరి బాయి అనే గర్భిణీ స్త్రీ కు ఏ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా సంఘం సభ్యులు స్పందించి ఆమెకు రక్తం అందించారు.సొసైటీ సభ్యులు ఇమ్రాన్ అనే యువకుడు రక్త దానం చేశారు.హజ్రత్ హసేన్ హుస్సేన్ జ్ఞాపకార్థకం రక్తదానంతో పాటు పాలరసం జ్యూస్ ,బెల్లం జ్యూస్ లను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ చేతుల మీదుగా పంపిణి చేసినట్లు తెలంగాణ ఏక్తా వెల్ఫేర్ సొసైటీ సంఘం అధ్యక్షులు షేక్ ముజాహిద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సాజిద్, జాయింట్ సెక్రటరీ జుబేర్, ప్రధాన కార్యదర్శి అల్మాస్ ,అఫ్రోజ్ ఖాన్, అజహర్, అమాన్, కావేరి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు పాల్గొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
గురువారం 18 జూలై 2024

# డిజిటల్ రూపంలో విద్యార్థుల వివరాలు

హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థి వివరాలు డిజిటల్ రూపంలోకి మారనున్నాయి. జిల్లాల్లో విద్యార్థుల సంఖ్య, అందులో ప్రైవేటు స్కూళ్లో చదువుతున్న వారి వివరాలు.. గురుకులాలు, మైనార్టీ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో విద్యార్థుల వివరాలన్నింటిని శాఖ అధికారులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల సమగ్ర సమాచారాన్ని క్రోడీకరించేందుకు ప్రభుత్వం యూడైస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఎంతమంది అన్న వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుస్తాయి. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న పుస్తకాలు, ఏకరూప దుస్తులను కచ్చితంగా లెక్కగట్టేందుకు, మధ్యాహ్న భోజనం సద్వినియోగమయ్యేందుకు యూడైస్ విధానం ఉపయోగపడనుందని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

పేర్లు, వివరాలు ఒక్కసారే.. పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆయా ప్రభుత్వ ప్రైవేటు సంస్థల ప్రతినిధులు నమోదుచేస్తున్నారు. అందుకు



ప్రతి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, లాగిన్‌ను జిల్లా అధికారులు కేటాయించారు. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్‌లో నమోదైన విద్యార్థులకు మాత్రమే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు ఇస్తున్నారు. గతంలో నగరంలోని కొన్ని పాఠశాలల్లో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నా.. ఎక్కువగా ఉన్నట్టు చూపించారు. యూడైస్‌లో ఒక్కో తరగతిలో ఎంత మంది విద్యార్థులున్నారన్న అంశంపై కచ్చితమైన సమాచారం ఉండటంతో ఇకపై అలాంటి తప్పులకు అవకాశముండదు.

శాశ్వత విద్యా సంఖ్య..హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు ప్రతి ఒక్కరికీ శాశ్వత విద్యా సంఖ్యను కేటాయించారు. హైదరాబాద్ జిల్లాలో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారినా, ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరినా శాశ్వత విద్యా సంఖ్య మారదు.

# కుర్చీలు కదలనున్నాయ్

హైదరాబాద్ : జలమండలిలో ఏళ్లుగా వివిధ విభాగాల్లో తిష్ఠవేసిన పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కుర్చీలు కదలనున్నాయి. నాలుగేళ్లు, అంతకంటే ఎక్కువ సంవత్సరాలు ఒకేచోట ఉన్న చాలామందికి స్థాన చలనం కల్పించనున్నారు. చీఫ్ జనరల్ మేనేజర్ నుంచి లైన్‌మేన్ వరకు దాదాపు 3,900 మంది సేవలు అందిస్తుండగా..40 శాతం మందిని బదిలీ చేయనున్నారు. మహానగరంలో దాదాపు 1,400 చదరపు కిలోమీటర్ల పరిధిలో అవుటర్ రింగ్‌రోడ్డు వరకు జలమండలి సేవలందిస్తోంది. తాగునీటితో పాటు మురుగు నీటి నిర్వహణ జలమండలి పరిధిలో ఉంది. గచ్చిబౌలి, కోకాపేట్, నానక్‌రాంగూడ, మణికొండ వంటి ప్రాంతాల్లో భారీ ఎత్తున వాణిజ్య, వ్యాపార, నివాస సముదాయాలు వస్తున్నాయి. వీటికి కొత్త కనెక్షన్లు ఇచ్చేప్పుడు కొందరు అధికారులు అంతా తామై చక్రం తిప్పుతున్నారు. కొందరైతే మేనేజర్ల పోస్టులతో ప్రస్థానం ప్రారంభించి అదే డివిజన్‌లో జీఎంలు, డీజీఎంలుగా కూడా కొనసాగుతున్నారు. శివార్లలో కొందరు జీఎంలు, డీజీఎంలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. ఏళ్లుగా ఒకచోట పాతుకుపోవడంతో ఇలా వ్యవహరిస్తున్నా



రన్న విమర్శలున్నాయి. బదిలీలను ఎలాగైనా తప్పించుకోవడానికి ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో కొందరున్నట్లు తెలుస్తోంది.

కిందిస్థాయి సిబ్బందికి సైతం..

ఉన్నతాధికారులే కాకుండా కింది స్థాయిలో పనిచేస్తున్న లైన్‌మేన్లు, ఇతర నాలుగో తరగతి సిబ్బందిని సైతం బదిలీ చేయనున్నారు. ఆయా డివిజన్ల సీజీఎంలు ఈ నివేదిక సిద్ధం చేస్తున్నారు. ఈ బదిలీలను కింది స్థాయి సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల ఎండీని కలిసి ఇబ్బందులను వివరించారు. ఒక్కో లైన్ పరిధిలో 40వరకు వాల్వులుంటాయి. అవెక్కడెక్కడ ఉంటాయో వారికే తెలుస్తుంది. సమయానికి నీటి సరఫరా చేయాలంటే వీళ్లే కీలకం. ఒక్కసారిగా అందరినీ బదిలీ చేస్తే సరఫరాపై ప్రభావం పడుతుందంటున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్న తర్వాతే బదిలీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# దారులు చెరువులై.. అవస్థలు చేరువై

హైదరాబాద్: నగరంలో కుండపోత వర్షానికి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అర్ధరాత్రి వరకు వాన కురిసింది. చాలాచోట్ల మోకాళ్ల లోతులో వరద ప్రవహించింది. నాచారంలో పోలీస్‌స్టేషన్ వెనుక ప్రహరీ కూలిపోయింది. కొత్తగూడ-హాఫీజ్‌పేట మార్గంలో వరద నిలిచింది. పంజాగుట్ట కూడలిలో ఉన్న మల్టీప్లెక్స్‌లో సినిమా చూస్తున్న ప్రేక్షకులకు ఊహించని అనుభవం ఎదురైంది. వర్షం నీరు



పైనుంచి కారడంతో ఒక్కసారిగా ఏం జరుగుతుందోని ఆందోళనకు గురయ్యారు. నిర్వాహణ తీరుపై యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేశారు. వరదనీటిని తొలగించేందుకు అధికారులను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి అప్రమత్తం చేశారు. ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ పలు ప్రాంతాల్లో పర్యటించి సహాయ చర్యలను పర్యవేక్షించారు. 15 ఉపకేంద్రాల పరిధిలో నిలిచిన సరఫరా.. నగర శివారులోని మల్కారంలో 132కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో పిడుగుపాటుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో 40 వరకు 33కేవీ ఉపకేంద్రాలకు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

# కాసుల ఎర.. మాయగాళ్ల చెర



హైదరాబాద్: జగిత్యాలకు చెందిన యువకుడు ఉపాధి కోసం నగరానికి వచ్చి ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ ఖాళీ సమయాల్లో బైక్ ట్యాక్సీ నడుపుతున్నాడు. ఇటీవల సొంతూరు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వ్యక్తి పరిచయమయ్యాడు. అతడి మాటలు నమ్మి రూ. 5వేలకు ఆశపడి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు ఇచ్చాడు. తన ఖాతాతో ఏం చేస్తున్నారనే తెలిసేలోపే ఆ యువకుడికి టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ఫోన్ చేశారు. రూ.లక్షల్లో అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్టు చెప్పారు. తనకేం తెలియదని మొదట బుకాయించినా డబ్బుపై ఆశతో సహకరించినట్టు అంగీకరించాడు. ఇదే తరహాలో కరీంనగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలనుంచి ఉద్యోగావకాశాల కోసం వచ్చిన 11 మంది తమ బ్యాంకు ఖాతాలు ఏజెంట్ల చేతికిచ్చి పోలీసు రికార్డుల్లోకి చేరారు. ఈ విషయం తమ వారికి తెలిస్తే సొంతూళ్లో ముఖం చూపలేమంటూ ఓ బాధితుడు ఆవేదన వెలిబుచ్చారు.

కేసులతో ఉక్కిరిబిక్కిరి..

కమీషన్లపై ఆశతో అమాయక యువత సైబర్ ఉచ్చులో చిక్కుతున్నారు. పోలీసు కేసుల్లో ఇరుక్కొని బయటపడలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరికొందరు జైలు నుంచి బయటకొచ్చాక ఏజెంట్ల అవతారమెత్తుతున్నారు. దేశ, విదేశాల్లోని కేటుగాళ్లకు సహకరిస్తున్నారు. ఉన్నతవిద్య, ఉపాధి బాటలో వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది యువతీ, యువకులు నగర బాట పడుతున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా కుటుంబానికి సహకరించవచ్చని ఆలోచిస్తున్నారు. నిరుద్యోగుల బలహీనతను అవకాశం చేసుకున్న ఏజెంట్లు, దళారులు వీరికి వల విసురుతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడే దేశ, విదేశీ ముఠాలకు అవసరమైన బ్యాంకు ఖాతాలు, నకిలీ సంస్థల డైరెక్టర్లుగా వ్యవహరిస్తే భారీఎత్తున కమీషన్ ఇస్తామని ఆశ చూపుతున్నారు. తెరవెనుక అసలు బాగోతం తెలియని యువత మాయగాళ్ల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నారు. నగరానికి చెందిన వెంకటేశ్, విజయ్(36) టెలిగ్రామ్ ద్వారా సైబర్ నేరగాళ్లకు దగ్గరయ్యారు. వారికి బ్యాంకు ఖాతాలు సమకూర్చి రూ. 3కోట్ల మేర సొత్తు కొల్లగొట్టారు. తిరుపతికి చెందిన శిరీష్‌కుమార్ చైనాలోని కేటుగాళ్లకు సహకరించి నగర యువతి నుంచి రూ. 60లక్షలు కాజేశాడు. ఈ ముగ్గురు పోలీసులకు చిక్కి అరెస్టయ్యారు. పోలీసు రికార్డుల ప్రకారం సుమారు 1000 మంది వరకూ సైబర్ ముఠాలకు తమ ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు ఇచ్చినట్టు గుర్తించామని నగరానికి చెందిన పోలీసు అధికారి తెలిపారు.

ఇదీ మాయగాళ్ల ఎత్తుగడ

సైబర్ నేరాల ముఠాలకు సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు కావాలి. తమ వ్యక్తిగత సమాచారంతో లావాదేవీలు జరిపితే పోలీసులకు చిక్కుతామనే ఉద్దేశంతో బయటివారిని పావులుగా మలుచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఏజెంట్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. అదే మాధ్యమాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో తమకు సహకరించే వారి కోసం గాలిస్తున్నారు. ముందుకొచ్చిన వారిద్వారా నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, నిరుద్యోగ యువకులు, చిరుద్యోగులు ఒక్కొక్కరికి రూ. 10-15 వేలిచ్చి బ్యాంకుల్లో ఖాతాలు తెరుస్తున్నారు. వాటిని దేశ,విదేశాల్లోని సైబర్ ముఠాలకు చేరవేస్తున్నారు. ఒక్కో బ్యాంకు ఖాతా ప్రారంభించినందుకు రూ. 30-50వేలు కమీషన్‌గా అందుతుంది. బ్యాంకు ఖాతా అద్దెకిచ్చినందుకు రూ.లక్ష లావాదేవీకు రూ.వెయ్యి కమీషన్‌గా ఇస్తారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు ఖాతాలు గుర్తించినా అప్పటికే నగదు మాయగాళ్ల చేతికి చేరుతుంది.

# కాలుష్యం.. ప్రాణసంకటం



తాండూరు: విద్యాసంస్థలకు సమీపంలో పరిశ్రమలు ఉండడంతో విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారుతోంది. అయిదు గ్రామాల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. సర్కారు భూములు అందుబాటులో ఉండటంతో పరిశ్రమల చెంతనే విద్యాసంస్థలను నెలకొల్పుతున్నారు. విద్యార్థులు, గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు.

విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు: తాండూరు మండలంలోని ఐనెల్లి శివారులో విద్యాసంస్థల చెంతనే పరిశ్రమలు నడుస్తున్నాయి. వాతావరణం కలుషితం అవుతుండడంతో దీర్ఘకాలంలో ఆరోగ్యాలపై ప్రభావం పడుతుందని భయాందోళన చెందుతున్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాలలో 600లకుపైగా విద్యార్థులు చేరారు. వంద మంది బాలికలకు వసతిగృహాన్ని ఏర్పాటు చేశారు. చెంతనే కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాల నిర్వహిస్తుండగా.. 400 మందికిపైగా విద్యార్థినులున్నారు. అవతలివైపు రూ. 18 కోట్లతో మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రారంభించారు. అందులో 600 మందికి భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సమీపంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కళాశాల ఉన్నాయి. వాటిల్లో 800కుపైగా చేరారు. ఒకేచోట పక్కపక్కనే నాలుగు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సర్కారు లక్ష్యానికి గండి: ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు చదువులకు దూరం కారాదన్న ఉద్దేశంతో ప్రభుత్వం వసతిగృహాలు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు, కళాశాలలను నెలకొల్పింది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు వాటిలో చేర్పిస్తున్నారు. విద్యాసంస్థల చెంతనే కాలుష్యాన్ని వెదజల్లే వ్యర్థాల పరిశ్రమలు కొనసాగుతున్నాయి. కస్తూర్బాగాంధీ పాఠశాల వెనక ఉన్న ఓ పరిశ్రమలో నెల కిందట అగ్నిప్రమాదం జరిగి మూతపడింది. హైదరాబాద్‌లో ఉంటున్న యజమాని పనులు ప్రారంభించారు. ఈ విద్యాసంస్థల పక్కనే గుజరాత్‌కు చెందిన యజమాని కర్మాగారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో పరిసరాల్లో దుర్వాసన, నీటి, గాలి కాలుష్యం ఏర్పడి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, చర్మవ్యాధులు, జలుబు, తలనొప్పితో చదువులపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటంతో విద్యాసంస్థల నిర్మాణానికి అధికారులు వాటిని కేటాయిస్తున్నారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమల చెంతనే విద్యాసంస్థలు నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, ఐనెల్లి, జిన్‌గుర్తి, కోటబాస్పల్లి గ్రామస్థులు సైతం కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. పంట దిగుబడులు తగ్గుతున్నాయి.

ఊపిరాడని పరిస్థితి..- విజయరత్న, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ, తాండూరు

పాఠశాల, కళాశాల పక్కనే పరిశ్రమలు కొనసాగుతున్నాయి. వాటి నుంచి దుర్వాసన వస్తోంది. సాయంత్రం వేళ ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంటోంది. వందల మంది విద్యార్థుల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతోంది. విద్యాసంస్థల పక్కన కాలుష్య పరిశ్రమలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

# ఖాళీ ప్లాట్లు.. ప్రజల పాట్లు

పెద్దపల్లి: రామగుండం నగరంతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు నిలిచి ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి పాములు, తేళ్లు, దోమలకు ఆవాసాలుగా మారి కాలనీవాసులకు కంటిమీద కునుకును దూరం చేస్తున్నాయి. ఒకవైపు అందమైన భవనాలు నిర్మించుకుంటే పక్కన ఉండే ఖాళీ ప్లాటులో చెత్తచెదారంతో పాటు వర్షపునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాకాలం వస్తే చాలు అపరిశుభ్రత ఏర్పడి పలు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

అపరిశుభ్ర ప్రాంతాలు ఇవే..

రామగుండంలో ఇందిరానగర్, అయోధ్యనగర్‌కాలనీ, రాజీవ్‌గాంధీనగర్, ప్రగతినగర్, మాతంగికాలనీ, జ్యోతినగర్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు చెత్తచెదారం, అపరిశుభ్ర పరిసరాలతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. నోటీసులు ఇచ్చేందుకు సర్వేలు చేస్తున్నామని రామగుండం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తెలిపారు. 50 డివిజన్లకు ఇద్దరేసి చొప్పున శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఖాళీ స్థలాలను గుర్తించి త్వరలో యజమానులకు నోటీసులు ఇస్తామని స్పందించకుంటే పురపాలక చట్టం నియమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు.

పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో శివపార్వతీ నగర్, శాంతినగర్, రంగంపల్లి, లేక్‌వ్యూ కాలనీ, భూంనగర్, తెలుగువాడ ప్రాంతాల్లో 150 వరకు ఖాళీ స్థలాలు గుర్తించి యజమానులకు నోటీసులు ఇచ్చామని కమిషనర్ వెంకటేశ్ పేర్కొన్నారు.

మంథనిలో ఎక్కువగా లైన్‌గడ్డ ప్రాంతం, చైతన్యపురి కాలనీ, మంథని బస్‌డిపో పక్కన, శ్రీరామకాలనీ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఖాళీస్థలాలు ముళ్ల కంపలు, చెత్తచెదారాలతో డంపింగ్ యార్డులుగా మారిపోయాయి. నోటీసులు ఇస్తున్నా యజమానులు స్పందించకపోవడంతో తాత్కాలికంగా యంత్రాలతో శుభ్రం చేయిస్తున్నారు.



సుల్తానాబాద్‌లో మార్కండేయ కాలనీ, స్వప్నకాలనీ, గాంధీనగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఖాళీ స్థలాలుండగా సంబంధిత అధికారులు నోటీసులు ఇవ్వలేదు.

నోటీసులు ఇచ్చినా స్పందనేదీ!

రామగుండం ప్రజారోగ్య విభాగంతో పాటు మూడు పురపాలికల పరిధిలో దాదాపు గరిష్ఠంగా 800 వరకు ఖాళీ స్థలాలుంటాయి. ప్రజారోగ్య భద్రత దృష్ట్యా పురపాలక శాఖ నిబంధనల ప్రకారం ఖాళీ ప్లాట్లపై ఆయా కమిషనర్లకు చర్యలు తీసుకునే అధికారం ఉంది. ఖాళీ స్థలం యజమానిని గుర్తించి ముందుగా నోటీసులు జారీ చేయాలి. వారం రోజుల్లోగా ప్లాటు శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగిసినా యజమానులు పట్టించుకోకపోతే మున్సిపల్ కార్మికులు, యంత్రాలతో స్థలాన్ని చదును చేయించి గరిష్ఠంగా రూ. 5 వేల నుంచి స్థలాన్ని బట్టి జరిమానా విధించాలి. ప్రజారోగ్య విభాగ అధికారులు మాత్రం కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# సంరక్షణ పెరగాలి.. హరితం విరియాలి

పెద్దపల్లి : వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటే పనులు ఊపందుకున్నాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణం అనుకూలంగా మారింది. రహదారుల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో ఉపాధిహామీ కూలీల చేత గుంతలు తవ్వించి మొక్కలు నాటుతున్నారు. ఇంటింటికీ ఆహ్లాదం పంచే వాటితో పాటు పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో వివిధ శాఖల సమన్వయంతో ముందుగా 16 లక్షల లక్ష్యం నిర్దేశించి సన్నద్ధమయ్యారు. తాజాగా అది 27 లక్షలకు పెరగడం అధికారులకు సవాల్‌గా మారింది. సామూహిక వనాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించగా స్థలాల కొరత ఏర్పడింది. గతంలో ఎదురైన అడ్డంకులు అధిగమిస్తే ఆశయం నెరవేరుతుంది.

80 శాతం శాఖల్లో మొదలే లేదు

జిల్లాలో పెరిగిన లక్ష్యాలకు అనుగుణంగా వివిధ ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు, పరిశ్రమలకు మొక్కలు నాటే పనులు కేటాయించారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరామ్ పరిశ్రమలకు 3.85 లక్షలు, రామగుండం నగరపాలకసంస్థకు 2.45 లక్షలు, మున్సిపాలిటీల్లో పెద్దపల్లికి 1.20 లక్షలు, మంథనికి 50 వేలు, సుల్తానాబాద్‌కు 72 వేల మొక్కల లక్ష్యం నిర్దేశించారు. అధికంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 14.35 లక్షల లక్ష్యం విధించారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 4.49 లక్షల మొక్కలు నాటారు. గృహాలకు 7.05 లక్షలు పంపిణీ చేశారు.



దాదాపు 35 శాఖలను భాగస్వాములను చేయగా 80 శాతానికి పైగా శాఖల్లో ఒక్క మొక్క కూడా నాటలేదు. అదునులో మొక్కలు నాటితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

ప్రతి మొక్కకూ కంచె ఏర్పాటు

జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నాటే ప్రతి మొక్కకూ కంచె ఏర్పాటు చేస్తున్నాం. విడతల వారీగా నీటి తడులు అందించనున్నాం. సామూహిక వనాల పెంపకంపై పర్యవేక్షిస్తాం. లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నాటిన ప్రతి మొక్కనూ బతికించాలి. ప్రజలకు అవసరమైన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయాలి. సంరక్షణ బాధ్యత తీసుకుంటేనే సార్థకత ఉంటుంది. ఇకపై మొక్కల పెంపకంపై ఆడిట్ నిర్వహించాలి.

ఇటీవల పెద్దపల్లిలో వన మహోత్సవం ప్రారంభంలో మంత్రి శ్రీధర్‌బాబుఆటంకాలు అధిగమిస్తేనే పచ్చదనం

అధికారులు మొక్కలు నాటడం వరకే పరిమితమవుతుండటంతో కంచె లేక పశువుల పాలవుతున్నాయి.

సంరక్షణ చర్యలు నామమాత్రంగా చేపట్టడం, నీటి తడులు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి.ఇళ్లలో అవసరమైన మామిడి, బత్తాయి, ఇతర పండ్ల మొక్కలు పంపిణీ చేయడం ద్వారా సంరక్షణపై బాధ్యత పెరుగుతుంది.సాముహిక వనాల పెంపకంపై దృష్టి సారించాలి. పర్యవేక్షించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి.

# పైకి రాని భూగర్భ జలాలు

కరీంనగర్ : తెలంగాణకే ధాన్యాగారంగా ఉన్న జిల్లాలో వర్షాకాలంలోనూ ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులైనా ఒక్క పెద్ద వాన కురవకపోవడం రైతులకు అశనిపాతంగా మారింది. ఆశించిన వర్షాలు కురవకపోవడం, జలాశయాల్లోకి వరద చేరకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కిందటి ఏడాది జూన్‌లో జిల్లాలో 7.43 మీటర్ల లోతులో నీరు ఉండగా ఈ ఏడాది జూన్‌లో 8 మీటర్ల లోతుకు భూగర్భజలం పడిపోయినట్లు అధికారులు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈసారి 0.57 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. అత్యధికంగా గంగాధర మండలంలో 15.55 మీటర్ల లోతుకు పడిపోగా కరీంనగర్‌లో 14.62 మీటర్లు, చొప్పదండి మండలంలో 14.25 మీటర్లకు భూగర్భజలం పడిపోయింది. మానకొండూరు మండలంలో అత్యల్పంగా 2.80 మీటర్ల లోతులో నీరు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

జలాశయాలు వెలవెల..

వరప్రదాయనిగా ఉండాల్సిన సాగునీటి ప్రాజెక్టులు నీరులేక బోసిపోతున్నాయి. గోదావరి నది ఆధారంగా నీటితో కళకళలాడాల్సిన ఎస్సారెస్పీ వరద కాలువ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలు నీరు లేక అడుగంటిపోయాయి. ఇక చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తున్నాయి. కొందరు అక్రమంగా చెరువుల్లోని మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 123.6 మి.మీ కాగా 14 రోజుల్లో 207.4 మి.మీ వర్షం కురిసింది. జులై 10 వరకు సాధారణ వర్షపాతం 57.9 మి.మీ కాగా మూడు రోజుల్లో కేవలం 38.1 మి.మీ వర్షం మాత్రమే నమోదైంది. జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ పంటల సాగు 3,31,252 ఎకరాలు కాగా ఇప్పటికీ 54,903 ఎకరాల్లో మాత్రమే వేశారు. గతేడాది 94,759 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు కురవకపోతే పంటల సాగు కష్టమే అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

మనం మారుదామా..

గతేడాది అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయనుకుంటే.. ఈ ఏడాది సీజన్ ప్రారంభమై నెల దాటినా భారీ వర్షాలు పడలేదు. సాగు చేద్దామనుకునే రైతులు వెనుకముందు ఆలోచిస్తున్నారు. మరో పక్క వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఈసారీ సమృద్ధిగా వానలు కురవకుంటే కష్టాలు రెట్టింపు అవుతాయి. ఇప్పటికైనా ప్రజలు నీటిని ఒడిసిపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. అవసరమైన చోట ఇంకుడుగుంతలు తవ్వుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి.

దున్నిన మడులు ఎండిపోయి..

వరద కాలువ ఆధారంగా అయిదెకరాల్లో వరి పంట వేసేందుకు దున్నిన పొలం మడులు నీరు అందక ఎండిపోయాయి. వ్యవసాయ బావి, బోరు ఆధారంగా వేసిన వరి పంట కూడా వర్షాలు కురవక ఎండుముఖం పట్టింది. వానాలు కురవకపోతే పెట్టుబడులు మట్టిపాలవుతాయి. ఇక వరుణ దేవుడే మమ్మల్ని కాపాడాలి.చిరుత రమేశ్, గంగాధర

## వీధికుక్కల దాడిలో బాలుడి మృతి ఘటన కలచివేసింది: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కుక్కల దాడిలో బాలుడి మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాలుడి మృతి కలచివేసిందని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధికుక్కల దాడిపై ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పశు వైద్యులు, బ్లూక్రాస్ వంటి సంస్థల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. కుక్క కాటుకు అన్ని ఆసుపత్రుల్లో తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. శునకాల నియంత్రణలో ఇతర రాష్ట్రాల పద్ధతులను పరిశీలించాలని చెప్పారు. జవహర్‌నగర్‌లో వీధికుక్కల దాడిలో 18 నెలల చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే.

## 4 నెలల్లో నైనీ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్: సింగరేణి సంస్థకు ఒడిశాలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించి మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. నాలుగు నెలల్లో గని నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం సచివాలయంలో ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్, ఇతర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నైనీ బొగ్గు బ్లాక్‌పై చర్చించారు. సింగరేణి తొలిసారిగా తెలంగాణ వెలుపల చేపడుతున్న ప్రాజెక్టు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ, కంపెనీ ప్రతిష్ఠను పెంచేలా మైనింగ్ చేపట్టాలన్నారు. స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కోరారు. ఒడిశా రాష్ట్ర అటవీ శాఖతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని సింగరేణి సంస్థను ఆదేశించారు. "నైనీ బ్లాక్ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి.



వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. హైటెన్షన్ విద్యుత్తు లైన్‌ను వెంటనే నిర్మించే విధంగా ఒడిశా విద్యుత్ శాఖతో సంప్రదిస్తూ ముందుకు సాగాలి. పునరావాస, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్‌పీడీఏసీ మీటింగ్‌ను అతి త్వరగా పూర్తి చేసుకోవాలి. 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తత వల్ల ఇప్పటికీ ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి సింగరేణిపై ఉన్న ప్రత్యేక చొరవ కారణంగా నేను స్వయంగా ఒడిశా వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో అన్ని సమస్యల పరిష్కారానికి చర్చించాను" అని భట్టి విక్రమార్క తెలిపారు. సమావేశంలో సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ.. సమావేశంలో సూచించిన ప్రకారం ప్రతి పనికి నిర్దేశిత కాలపరిమితిని విధించుకొని పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వివరించారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోం: హరీశ్‌రావు



పటాన్‌చెరు: పార్టీ మారిన ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరులో నిర్వహించిన భారాస కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టులో పోరాడుతున్నామని, ఆ నియోజకవర్గాల్లో కచ్చితంగా ఉప ఎన్నిక వస్తుందన్నారు. 2001లో కేసీఆర్ ఉద్యమాన్ని పిడికెడు మందితో ప్రారంభించారని.. అప్పుడు కూడా కుట్రలు జరిగాయని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తమ పార్టీకి చెందిన 12మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్నారన్నారు. కానీ, కుట్రలు ఫలించలేదని, న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ 14 ఏళ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. "భారాస పని అయిపోయిందన్నవాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. ఎమ్మెల్యే పోతే పార్టీ పోదు. పటాన్‌చెరులో మంచి కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే. మీరందరూ కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారు. పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చాం. రోడ్లు, తాగునీరు, స్టేడియం వంటివి ఎన్నో అందించాం. నిధుల వరద పారించాం. గూడెం పోయినా గుండె ధైర్యం కోల్పోవాల్సిన అవసరం లేదు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్ ఇప్పుడు ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారు. జీవోలో రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పారు. మళ్లీ వ్యతిరేకత వస్తోందని మాట మార్చుతున్నారు. పాస్‌బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెబుతున్నారు. అదే నిజమైతే జీవో మార్చాలి. వడ్లకు బోనస్ అన్నారు.. తర్వాత సన్నవడ్లకే బోనస్ అంటూ 90 శాతం రైతులకు బోనస్ ఎగ్గొట్టారు. ఇప్పుడు రుణ మాఫీ విషయంలోనూ అదే చేస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదు" అని హరీశ్‌రావు విమర్శించారు.

## ఖైరతాబాద్ గణేష్ వద్ద టెన్షన్.. టెన్షన్.. 70 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

హైదరాబాద్: ఖైరతాబాద్ గణేష్ వద్ద టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ ఏర్పాట్లలో గందరగోళం చోటు చేసుకుంది. 70 ఏళ్ల ఖైరతాబాద్ గణేశ్ చరిత్రలో తొలిసారిగా అవంతరాలు ఎదురవుతున్నాయి. గణేష్ విగ్రహ తయారీ పనులు ముందుకు సాగడం లేదు. ప్రతి ఏటా వంద రోజుల ముందు నుంచే ఖైరతాబాద్ గణేష్ విగ్రహ తయారీ పనులు ప్రారంభమవుతాయి. ఈసారి ఉత్సవ కమిటీ రెండు వర్గాలుగా చీలి పోయింది. ఈ వర్గపోరు కారణంగా పాత కమిటీ, కొత్త కమిటీల మధ్య సమన్వయం కొరవడింది.

దీంతో 36 రోజుల పాటు విగ్రహ పనులు నిలిచిపోయాయి. తమకు సమాచారం ఇవ్వకుండానే కొత్త కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఉత్సవ ప్రెసిడెంట్ రాజ్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ చైర్మన్ సుదర్శన్ తర్వాత గత ఏడాది ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను ఆయన కుమారుడు సుదర్శన్ నిర్వహించారు. ఈ ఏడాది సింగారి కుటుంబాన్ని పక్కనబెట్టి తామే ఉత్సవ పనులను చూస్తామని స్థానికులు అంటున్నారు. ఇది ఘర్షణకు దారి తీసింది. ఈ వివాదాన్ని సరిదిద్దేందుకు దానం నాగేందర్ రంగంలోకి దిగారు. ఆయన అధ్యక్షతన రెండు కమిటీల సమావేశం జరగనుంది. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ గణేష్ మండపం వద్ద భారీగా పోలీసుల మోహరించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




హైదరాబాద్: రాష్ట్రంలో ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇవాళ కుమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతాయని తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ గంటలకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. నిన్న దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర విదర్భ ప్రాంతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రాంతం ఈ రోజు బలహీనపడినట్లు తెలిపింది. రుతుపవన ద్రోణి ఈరోజు జైసాల్మయిర్, కోట, గుణ, కళింగపట్నం తూర్పు ప్రాంతం గుండా మధ్య బంగాళాఖాతం వరకు పయనిస్తూ సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగుతున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. మరో అల్పపీడనం ఈ నెల 19న పశ్చిమ మధ్య దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.




## 2000 పోస్టులకు 25వేల మంది.. నిరుద్యోగులతో నిండిన ముంబయి ఎయిర్‌పోర్టు

ముంబయి: ఎయిర్‌పోర్టుకు భారీగా తరలివచ్చిన జనాలను చూసి, అక్కడి సిబ్బంది ఆశ్చర్యపోయారు. వారిని నియంత్రించలేక నానా ఇబ్బందులు పడ్డారు. అదంతా ప్రయాణికుల రద్దీ ఏమీకాదు. ముంబయి ఎయిర్‌పోర్టులో నిర్వహించిన ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు వచ్చిన నిరుద్యోగులు వారంతా. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2,216 ఖాళీలను భర్తీ చేసేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో మంగళవారం ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. దీనికి నిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. కౌంటర్ల వద్ద తమ పత్రాలు సమర్పించేందుకు వారంతా ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. ఆహారం, నీరు అందక పలువురు ఇబ్బంది పడ్డారు. కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. లోడర్ పోస్టుల కోసం ఈ డ్రైవ్ జరిగినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ ఉద్యోగంలో చేరినవారు విమానం నుంచి లగేజీ దించడం, ఎక్కించడంతోపాటు బ్యాగేజీ బెల్టులను చూసుకోవాలి. ఒక్కో ఎయిర్‌క్రాఫ్ట్‌లో లగేజీ, కార్గోను చూసుకునేందుకు ఐదుగురు లోడర్స్ అవసరం ఉంటుంది. వారికి నెలకు రూ.20వేల నుంచి 25 వేలకు వేతనం అందిస్తారు. ఓవర్‌టైమ్ చేసి చాలామంది రూ.30వేల వరకు సంపాదిస్తుంటారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హతలు ఉంటే సరిపోతుంది కానీ, అభ్యర్థులు శారీరకంగా దృఢంగా ఉండటం తప్పనిసరి. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు కొందరు 400 కి.మీ. ప్రయాణించి రావడం గమనార్హం. వారిలో పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా ఇప్పటివరకు ఉద్యోగం లభించనివారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం కోసం వచ్చారు. మరికొందరు రాజస్థాన్ నుంచి వచ్చినవారు ఉన్నారు. ఇదిలాఉంటే.. గుజరాత్‌లోని అంక్లేశ్వర్‌లో కొద్దిరోజుల క్రితం ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఇంటర్వ్యూకు వచ్చిన ఉద్యోగార్థుల రద్దీ ఎక్కువై ఒకరినొకరు తోసుకున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

## ఖైరతాబాద్ మహా గణపతి కొత్త ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశాం..



హైదరాబాద్: ఖైరతాబాద్ మహా గణపతి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఈ ఏడాది గణేష్ నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ రోజు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మహా గణపతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితికి స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. రెండు కమిటీ ఆలోచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అందరూ ఉత్సవ కమిటీ సభ్యులేనని దానం నాగేందర్ అన్నారు. కులమతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. రాబోయే రోజుల్లో గిన్నిస్ రికార్డ్స్‌లోకి ఎక్కబోతున్నామని.. దీనిని బాధ్యతగా భావించి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మా మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవని తెలిపారు. అడ్‌హాక్ పేరుతో ఖైరతాబాద్ గణేష్ కొత్త ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. డొనేషన్స్ నుంచి వచ్చే డబ్బును రోజూ డిస్‌ప్లే చేస్తామన్నారు. విద్యా, ఆర్థిక స్థోమత లేని వారికీ సహాయం అందిస్తామన్నారు. మల్టి పర్పస్ కమ్యూనిటి హాల్ కట్టబోతున్నామని దానం నాగేందర్ వెల్లడించారు. ఇక్కడ ఖైరతాబాద్ వాసులు నామినల్ ఫీ కట్టి హాల్‌ను వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. అడహాక్ కమిటీకి తాను అధ్యక్షుడిగానూ.. రాజ్ కుమార్ చైర్మన్ గానూ ఉంటారని తెలిపారు. అడ్ హాక్ ఉత్సవ్ కమిటీలో 100 మంది సభ్యులు ఉంటారని తెలిపారు.

కమిటీ సభ్యులకు ఐడి కార్డు ఉంటుందని వెల్లడించారు. ఉత్సవ కమిటీ సభ్యులంతా సమానమేనన్నారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ్ కమిటీ , శ్రీ గణేష్ ఉత్సవ్ కమిటీ మధ్య విభేదాల నేపథ్యంలో అడ్ హాక్ పేరుతో కొత్త కమిటీ ఏర్పాటు చేశామని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఇక ఖైరతాబాద్ గణేషుని వద్ద ప్రతి రోజూ ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు. పోలీసులు, మీడియా వలంటీర్స్‌కు భోజనాలను ఏర్పాటు చేస్తామన్నారు. బోనాల ఫెస్టివల్ తర్వాత ధూప దీపాలకు నోచుకోని అన్ని టెంపుల్స్‌కి కమిటీలు ఏర్పాటు చేయబోతున్నామని దానం నాగేందర్ వెల్లడించారు.

## బోనాల చెక్కుల పంపిణీలో రాజకీయాలు వద్దు..

హైదరాబాద్: ఆర్కేపురం బోనాల చెక్కుల పంపిణీ వ్యవహారంలో ఎమ్మెల్యే సబితారెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ జహంగీర్, లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్యలు అన్నారు, మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ప్రోటోకాల్ ప్రకారం గౌరవించి చెక్కుల పంపిణీకి ఆహ్వానించినా కొంతమంది బీఆర్ఎస్(%దీ=ూ%) నేతలు రాజకీయాలు చేస్తున్నారనన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మ రెడ్డి కార్యక్రమంలో పాల్గొనడంతో గొడవ చేసి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరం ఇన్‌చార్జిగా ప్రకటించారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన ఉంటారన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి రాజకీయాలు చేయకుండా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తే బాగుంటుందన్నారు.

## విద్యార్థులు తినే పెరుగు తాగేసిన పిల్లి.. జేఎన్టీయూలో ఇదీ వైనం

హైదరాబాద్, జూలై 17: గత కొద్ది రోజుల క్రితం సుల్తానాబాద్ జేఎన్టీయూ క్యాంటీన్ చట్నీలో ఎలుక సంఘటన మరువక ముందే కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్‌లో పెరుగును పిల్లి తాగుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.రెండురోజుల క్రితం కూకట్‌పల్లి జేఎన్టీయూ విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పిల్లులు తింటున్న వీడియో సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు క్యాంటీన్‌లో వసతి గృహంలో వడ్డిస్తున్న ఆహార పదార్థాలలో నాణ్యత, శుభ్రత ఉండటం లేదని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పట్టించుకోలేదు.పైగా ఫిర్యాదులు, ఆందోళనలు చేసిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని మంజీరా బాయ్స్ హాస్టల్లో ఆహార పదార్థాలు నాణ్యతపై ఎప్పటినుంచో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇలా ఉండగా రెండు రోజుల క్రితం ఆహార పదార్థాలపై మొదలు లేకపోవడంతో బకెట్లో ఆహార పదార్థాలను పిల్లి మూతి పెట్టి తింటున్న దృశ్యాలను విద్యార్థులు వీడియోలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలను పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో గత రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారింది. మరి ఇప్పటికైనా ఆహార పదార్థాల నాణ్యత, శుభ్రతపై జేఎన్టీయూ యాజమాన్యం ఎలా స్పందిస్తూ వేచి చూడాలి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660